సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 10 । మార్చి । 2023



పాఠశాలల్లో ట్రైనీ ఐఏఎస్‌లు
గ్రామీణ ప్రాంతాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు జిల్లాకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లు పాఠశాలలను సందర్శించారు. 8లో▸



పట్టుబడిన పగటి దొంగ
నాలుగేళ్లుగా వరుస చోరీలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 72 దొంగతనాల్లో రూ.1.20 కోట్ల సొత్తు చోరీకి పాల్పడ్డాడు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం
ఆకాశం ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీ-థర్మల్‌కు ఊరట


బీ- థర్మల్ విద్యుత్ కేంద్రం కోల్ యార్డు

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల బీ థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు, ఆయిల్ సరఫరాకు ప్రతిపాదనలు పంపించాలని విద్యుత్‌సౌధ నుంచి గురువారం ఆదేశాలు అందినట్లు అధికారులు తెలిపారు. జనవరి 26 నుంచి విద్యుత్ కేంద్రానికి బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిపివేసిన విషయం తెల్సిందే. రెండురోజుల్లో నిల్వలు నిండుకోనున్నాయి. అదే జరిగితే విద్యుత్ కేంద్రం మూసివేత తప్పదని అందరూ భావించారు. ఈ క్రమంలో విద్యుత్ సౌధ నుంచి కబురు అందడంతో బీ థర్మల్ కేంద్రం కొనసాగింపుపై ఆశలు చిగురిస్తున్నాయి.

పీఎంకేవీవై షార్ట్‌టర్మ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా పలు షార్ట్‌టర్మ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహాచారి తెలిపారు. ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ మెషినింగ్ సెంటర్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ ప్రిపరల్స్, ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్‌లో ప్రవేశాలకు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై.. ఐటీఐ మధ్యలో ఆపేసిన 15నుంచి 45 ఏళ్లలోపు వారు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు ప్రతులను జతపర్చాలని కోరారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

కక్షపూరితంగానే కవితకు ఈడీ నోటీసులు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

మంథని: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగానే ఎమ్మెల్సీ కవితకు ఈడీ మాటున వేధింపులకు పాల్పడుతోందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. గురువారం మంథనిలో విలేకరులతో మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని మోదీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. కాంగ్రెస్ హయాంలో ఈడీ పేరుతో అమిత్‌షాను జైలుకు పంపించారని, ఇప్పుడు అదే రీతిలో ప్రధాని మోదీ, అమిత్‌షా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2018 ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన విధంగానే బీజేపీకి ఈసారి కూడా అదే ఫలితం వస్తుందని తెలిసి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, జక్కు రాకేశ్ ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగనిర్ధారణ చట్టం-1994 పరిధిలో అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రసవాల్లో వెయ్యి మంది మగ పిల్లలు జన్మిస్తే.. 948 మంది మాత్రమే ఆడపిల్లలు జన్మిస్తున్నారని పేర్కొన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో లింగనిర్ధారణ పరీక్షలు చేసినా.. చేయించుకున్నా.. ప్రోత్సహించిన వారికీ మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయిస్తున్నామని, తనిఖీలను ఆకస్మికంగా జరపాలని రెడ్‌క్రాస్‌సొసైటీ కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ సూచించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఫాం ఎఫ్ పూర్తి చిరునామాతో నింపేలా ఆదేశాలివ్వాలని ఆర్‌ఎంఓ డాక్టర్ భీష్మ పేర్కొన్నారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అయూబ్‌ఖాన్, డాక్టర్ రుక్మిణి, రాజమౌళి, కేవీ. సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

చిక్కుముడులు వీడేదెప్పుడో..!?



ధరణిలో తప్పుల సవరణకు తీవ్రజాప్యం

సాక్షి, పెద్దపల్లి: రెవెన్యూ సమస్యల నుంచి రైతులు, పట్టాదారులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను 2020 నవంబర్ 2న అందుబాటులోకి తెచ్చింది. అయితే కార్యాచరణకు వచ్చేసరికి మాత్రం పోర్టల్‌తో సమస్యలు ఎక్కువయ్యాయి. చిక్కుముళ్లు వీడక.. సమస్యలు కొలిక్కిరాక.. అసలుకే మోసం వస్తోంది. ముఖ్యంగా మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గుల సమస్యతో అన్నదాతలు రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీకి అనర్హులవుతున్నారు. దీంతో నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

- అపరిష్కృత భూసమస్యలతో రైతుల అవస్థలు
- పరిశీలించిన వాటిలో తిరస్కరించినవే ఎక్కువ
- రైతుబంధు డబ్బులు రాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో 70శాతం వరకు మంది అందిస్తున్న దరఖాస్తుల్లో ధరణి ద్వారా తమ సమస్యలను పరిష్కారం కాని వారే ఉంటున్నారు. వందశాతం భూసమస్యలు పరిష్కారం కావాలంటే ధరణి పోర్టల్‌లో ఆప్షన్లు మార్చాల్సి ఉంటుందని, అధికారులకు మరికొన్ని వెసులుబాట్లు ఉండాలని భూ నిపుణులు సూచిస్తున్నారు. అలాగే గతంలో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పినా.. వర్షాలతో బ్రేక్‌పడింది. ఇప్పటికైనా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే బాగుటుందని అన్నదాతలు అంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ధరణికి 24,214 దరఖాస్తులు రాగా అందులో 23,046 దరఖాస్తులు పరిష్కరించామని, మిగితావి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే పది రోజుల పాటు కలెక్టర్ కార్యాలయంలో అన్ని మండలాల తహసీల్దార్లు నిషేధిత భూములను పరిశీలించి 6,500 కేసులను గుర్తించారు. ఇందులో 2100 పరిష్కరించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భూసమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నా.. ధరణిలో పూర్తిస్థాయిలో మ్యాడ్యుల్స్ అందుబాటులో లేకపోవడం, సాంకేతిక సమస్యలతో పూర్తిస్థాయిలో నోచుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి..

- లవోణీ భూములు, సాదాబైనామా కాగితాలతో కొనుగోలు చేసుకున్న భూములకు ధరణి పోర్టల్ ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు కావడం లేదు. ఈ భూములను అవసరం నిమిత్తం ఎవరికైనా అమ్ముకున్నా రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో ప్రతి మండలంలో వేలాదిమంది రైతులు పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.
- అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించే విధానం కూడా పోర్టల్‌లో లేదు
- కొందరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ భూమి జాబితాలో పట్టాభూములు చేరాయి. సర్వేనంబర్లలో లోపాలు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా ఉన్న భూములను అవసరానికి అమ్ముకోలేని దుస్థితి. గతంలో అమ్మిన వారి పేరుపైనే పట్టాపాసు పుస్తకాలు జారీ చేస్తుండటంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు.
- ధరణి సమస్యల పరిష్కారానికి పలుమార్లు దరఖాస్తు చేసినా కుంటిసాకులతో అధికారులు తిరస్కరిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇటీవల ప్రభుత్వం కొన్ని సమస్యలకు కొత్త ఆప్షన్లను ధరణి పోర్టల్‌లో పొందుపరిచింది. తహసీల్దార్ రికార్డులను పరిశీలించి సరైన నివేదికను కలెక్టర్‌కు పంపిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అయితే చాలాచోట్ల తహసీల్దార్ నుంచి పరిశీలన నివేదికలు కలెక్టర్‌కు వెళ్లడంలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. ధరణిలో భూసమస్యలపై రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. జిల్లాలో 80 శాతం భూసమస్యలు పరిష్కరించామని, నిర్దేశిత దస్త్రాలను జోడించడంతోపాటు సక్రమంగా పూరిస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

విరాసత్ కావటం లేదు



నాకు మా గ్రామమైన లాలపల్లిలోని సర్వే నంబర్ 862లో ఎకరం భూమి ఉంది. ఆ భూమి మా తాత బాసంపల్లి ఎల్లయ్య పేరిట ఉంది. మాన్యువల్ పహణీలో వస్తున్నప్పటికీ.. ధరణిలో పేరు రావడం లేదు. ఫలితంగా విరాసత్ కావటం లేదు. ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్న. అధికారులు, ప్రభుత్వం స్పందించి విరాసత్ అయ్యేలా చూడాలి.
– బాసంపల్లి కొండయ్య, లాలపల్లి, ఎలిగేడు

కాళ్లరిగేలా తిరుగుతున్న



ఊళ్లో మాకు 386 సర్వేలో మా తాత నాగయ్య పేరిట ఉన్న భూమిని వేరే వ్యక్తికి పట్టా చేశారు. విరాసత్ చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి దరాఖస్తులు పెట్టిన. కాళ్లరిగేలా తిరుగుతున్నా పనిమాత్రం కావడం లేదు. అలాగే మరో 367 సర్వే నంబర్‌లో 27 గుంటల భూమి నా తండ్రి పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేయక ఇబ్బంది పడుతున్నాం.
– రామగిరి రాజయ్య, ముప్పిరితోట

నేడు సుల్తానాపూర్‌కు ఠాక్రే, రేవంత్ రాక

- ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ పోరాటం
- పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా సుల్తానాపూర్ ఎంపిక
- ధరణి అదాలత్ గ్రామసభకు ఏర్పాట్లు పూర్తి


సుల్తాన్‌పూర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి కోట నీలిమ

సాక్షి, పెద్దపల్లి: ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న 'ధరణి అదాలత్' కార్యక్రమానికి ఏఐసీసీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో భాగంగా సుల్తానాపూర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామసభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తికాగా.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నీలిమ గురువారం పరిశీలించారు. ఏఐసీసీ జాతీయ నాయకులు కొప్పుల రాజు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు.

విజయవంతం చేయండి..

ఎలిగేడు: ధరణి అదాలత్‌కు వస్తున్న కాంగ్రెస్ అధినేతల పర్యటనను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోరారు. సుల్తానాపూర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జైరాం రమేశ్ ప్రెస్‌మీట్ ఉంటుందన్నారు. కరీంనగర్ నుంచి రోడ్డుమార్గం ద్వారా సుల్తానాపూర్ వరకు 16 కిలోమీటర్ల పొడవునా రైతుల బాధలు తెలుసుకుంటారని తెలిపారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి వద్ద నాయకులకు స్వాగతం ఉంటుందని, భూపతిపూర్, ఐతరాజుపల్లి, బుర్హమియాపేట్ మీదుగా సుల్తానాపూర్ వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ ఉంటుందని తెలిపారు.

నాడు తెలంగాణ నినాదం.. నేడు ఛత్తీస్‌గఢ్ విధానం

- కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియం సభ చారిత్రకమవుతుందని ఆకాంక్ష
- కవాతు సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కదంతొక్కిన అభిమానులు
- హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రకు తరలివచ్చిన జనం
- కరీంనగర్ పవిత్ర స్థలమంటూ కొనియాడిన రేవంత్‌రెడ్డి
- యాత్ర ఫర్ చేంజ్ ఇక్కడి నుంచే ప్రారంభమన్న నేతలు
- బైబై కేసీఆర్ అంటూ సభా ప్రాంగణంలో ప్లకార్డుల ప్రదర్శన


సభలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, వేదికపై కాంగ్రెస్ ముఖ్య నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌టౌన్: 2004 మార్చిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇస్తామంటూ అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హామీ ఇచ్చిన అదే అంబేడ్కర్ స్టేడియం మరోసారి కాంగ్రెస్ నేతల వాగ్దానాలకు వేదికైంది. గతంలో ఇక్కడే ఇచ్చిన మాట ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినట్లే.. ఈసారి తాము అధికారంలోకి వస్తే.. రైతు, నిరుద్యోగుల అభ్యున్నతికి పాటుపడేలా ఛత్తీస్‌గఢ్ మోడల్‌ను అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలంతా ముక్తకంఠంతో హామీలిచ్చారు. చరిత్ర పునరావృతమవుతుందని, ఈ సభ చారిత్రకమవుతుందని కాంగ్రెస్ నేతలంతా ఆకాంక్షిస్తున్నారు. హాథ్ సే హాథ్ జోడో-యాత్ర ఫర్ చేంజ్‌లో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. జై కాంగ్రెస్.. జై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. బైపాస్ రోడ్‌లో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ స్టేడియం వరకు సాగిన పాదయాత్రకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. పాదయాత్ర ఆసాంతం రేవంత్‌రెడ్డి జనానికి అభివాదం చేస్తూ పలకరించుకుంటూ కొనసాగించారు. అనంతరం స్టేడియంలో కరీంనగర్ కవాతు పేరుతో నిర్వహించిన బహిరంగసభకు వేలాదిగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ప్రాంతంలో ఒక గొప్ప పవిత్ర స్థలం ఉంటుందని, కరీంనగర్‌లో అలాంటి గొప్ప పవిత్ర స్థలం అంబేడ్కర్ స్టేడియం అంటూ కొనియాడారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను గౌరవించి 2004లో ఇదే గడ్డపై తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చారని అన్నారు. తెలంగాణ సాక్షాత్కారం కావడంతో స్టేడియం తెలంగాణ తెచ్చిన పవిత్ర స్థలంగా మారిందన్నారు. వేములవాడ, కొండగట్టు పుణ్య క్షేత్రాలకు ఎంత ప్రాధాన్యత ఉందో.. ఈ స్టేడియంకు అంతే ఉందని అన్నారు. 'మాట తప్పక మడమ తిప్పక.. సోనియా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు కానీ ఇచ్చిన రాష్ట్రం ఇవాళ ఎవరిపాలైందో మీరు ఆలోచన చేయండి' అంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తల్లిని చంపి పిల్లను బతికించారని మోదీ అవహేళన చేశారని, తెలంగాణ ఏర్పాటు ఇష్టం లేని బీజేపీ నేతలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఇక్కడ గెలిచిన బండి సంజయ్ కూడా కరీంనగర్‌కు ఏం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, వి.హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యేలు వంశీ చందు, కొండా సురేఖ, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరెందర్‌రెడ్డి, చొప్పదండి నియోకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, అంజన్‌కుమార్, పద్మాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేలా మాట్లాడుతూ.. కరీంనగర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కరీంనగర్ గుర్తుకు వస్తుందని అని ప్రశంసించారు. తాము రైతు సంక్షేమానికి, గ్రామీణ వికాసానికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. తెలంగాణ వస్తే.. ఉపాధి అవకాశాలువస్తాయని యువత పెట్టుకున్న ఆశలను బీఆర్‌ఎస్ నెరవేర్చలేదని వాపోయారు.
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో ప్రజలను నిండా ముంచారని అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించే అర్హతను కోల్పోయారని, కేసీఆర్‌ను రాజకీయ ఉరికంభం ఎక్కించబోయేది కరీంనగర్ కావాలని ఆకాంక్షించారు.
- మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ మోడల్‌లో పాలన సాగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని కోరారు. కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ మరిచారని, కాంగ్రెస్ వస్తే నిరుద్యోగ భృతి, వరికి మద్దతు ధరతోపాటు బోనస్ ఇస్తామని స్పష్టం చేశారు.

మంత్రి గంగులపై చార్జిషీట్

అంతకుముందు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి స్థానిక మంత్రి గంగుల కమలాకర్‌పై చార్జిషీట్ విడుదల చేశారు. నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, మైనింగ్, అధికారి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు.


హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా పాదయాత్ర చేస్తున్న రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఎన్టీపీసీ నిర్మాణం జాప్యం..!

- విద్యుత్ కొనుగోలుకు తెలంగాణ డిస్కమ్‌ల ఒత్తిడి
- ప్రతిరోజూ రూ.6 నుంచి రూ.8 కోట్ల ఖర్చు
- తాజాగా ప్రాజెక్టుకు చేరిన సింగరేణి బొగ్గు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఆవరణలో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులు జాప్యం జరుగుతున్నాయి. తెలంగాణ స్టేజీ-1లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల రెండు యూనిట్లను కమిషనింగ్ చేయడంలో సంస్థ విఫలం కావడంతో తెలంగాణ డిస్కంలు ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ నుంచి విద్యుత్ కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు ఎక్స్ఛేంజీ ప్లాట్‌ఫాం నుంచి డిస్కంలు రోజువారీగా ఆరు నుంచి ఏడు కోట్ల యూనిట్లు కొంటున్నట్లు అంచనా. మూడు నెలల్లో ఐఈఎక్స్ నుంచి కొనుగోలు చేయడం ద్వారా డిస్కంలకు రూ.2,500 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. పవర్ యుటిలిటీస్ అధికారుల ప్రకారం డిస్కంలు ఐఈఎక్స్ నుంచి గరిష్ఠంగా యూనిట్‌కు రూ.12 చొప్పున విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఇది యూనిట్‌కు డిస్కంలు నేరుగా పవర్ స్టేషన్ల నుంచి కొనుగోలు చేసే ఖర్చు కంటే చాలా ఎక్కువ. అదే ఎన్టీపీసీలో ఉత్పత్తి ప్రారంభిస్తే యూనిట్ విద్యుత్‌కు కేవలం రూ.5.50 మాత్రమే ఖర్చవుతుంది. తద్వారా డిస్కంలకు కోట్లాది రూపాయలు ఆదా అవుతాయి.

ట్రాన్స్‌కో, జెన్‌కో ఆందోళన

డిస్కంలు ఐఈఎక్స్ నుంచి విద్యుత్ కొనుగోలు చేయాల్సి రావడంపై ట్రాన్స్‌కో, జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.ప్రభాకర్‌రావు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పూణెలో జరిగిన 45వ సదరన్ రీజియన్ పవర్ కమిటీ సమావేశంలో రామగుండంలోని ఎన్టీపీసీ కమీషన్ చేయడంలో ఎన్టీపీసీ సంస్థ వైఫల్యాన్ని ప్రభాకర్‌రావు లేవనెత్తారు.

గతేడాదే విద్యుత్ ఉత్పత్తి చేయాల్సింది

తెలంగాణ స్టేజీ-1లో నిర్మితమవుతున్న సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు కమిషన్ గతేడాది చేయాల్సి ఉంది. గడువులోపు పూర్తి చేయడంలో విఫలం కావడంతో ఎక్స్ఛేంజీ ప్లాట్‌ఫాం నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం ద్వారా ఖజానాపై అదనపు భారం పడుతోందని తెలుస్తోంది. ఈ క్రమంలో 800 మెగావాట్ల విద్యుత్ యూనిట్లను వెంటనే ప్రారంభించాలని ఎన్టీపీసీ అధికారులకు సూత్రప్రాయంగా తెలిపినట్లు సమాచారం.

2016లో ప్రాజెక్టు పెట్టుబడికి ఆమోదం..

తెలంగాణ స్టేజీ-1 ప్రాజెక్టులో నిర్మితమయ్యే 800 మెగావాట్ల రెండు యూనిట్లకు 2016లో పెట్టుబడి ఆమోదం లభించింది. నవంబర్ 2020 నాటికి ఎన్టీపీసీ మొదటి దశను కమిషన్ చేయాల్సి ఉంది. కోవిడ్ కారణంగా గడువులోపు చేరుకోలేకపోవడంతో జూలై 2022 వరకు పొడిగించారు. అయినా ఈ ఏడాది జూన్ వరకు ప్రాజెక్టు పూర్తి చేసి కమిషనింగ్ చేస్తామని ఎన్టీపీసీ సంస్థ హామీ ఇచ్చినట్లు సమాచారం. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ కౌన్సిల్ (సీఈఏ) మార్గదర్శకాల ప్రకారం కొత్త పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించిన తేదీ నుంచి 48 నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉంటుంది.


రైలుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

ఎన్టీపీసీకి చేరిన బొగ్గు

ఎన్టీపీసీ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు కమిషనింగ్‌లో భాగంగా అవసరమైన బొగ్గును సింగరేణి సంస్థ నుంచి రైలుమార్గం ద్వారా ప్రాజెక్టుకు గురువారం చేర్చింది. కమిషనింగ్‌లో 800 మెగావాట్ల విద్యుత్ యూనిట్ ప్రధాన మైలురాయిని సాధించిదని ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ ప్రసేంజిత్ పాల్ అన్నారు. ఒప్పందంలో బాగంగా 3,509 టన్నుల బొగ్గును ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందించనుందని, ఇందులో భాగంగా తొలి బొగ్గు ర్యాక్ (వ్యాగన్) ప్రాజెక్టు ట్రాక్‌హాపర్ వద్దకు చేరుకుందని తెలిపారు. దీంతో 800 మెగావాట్ల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకునే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు తపస్ సాహా, హరేరాం సింగ్, హల్దార్, రైల్వే విభాగం అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మహిళా దినోత్సవం

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య వృత్తి గొప్పదని, ప్రజలకు నేరుగా సేవ చేసే అదృష్టం కలుగుతుందని పేర్కొన్నారు.



అనంతరం మహిళా సిబ్బందిని సన్మానించారు. సూపరింటెండెంట్ దయాల్ సింగ్, ఆర్‌ఎంఓలు, హెచ్‌ఓడీలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదావరిఖని వన్‌టౌన్ సీఐగా ప్రమోద్‌రావు

- రమేశ్‌బాబు సీఎస్‌బీకి బదిలీ


ప్రమోద్‌రావు


రమేశ్‌బాబు

గోదావరిఖని: గోదావరిఖని వన్‌టౌన్ సీఐగా ఎస్.ప్రమోద్‌రావును బదిలీ చేస్తూ గురువారం నార్త్‌జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న రమేశ్ బాబును సీఎస్‌బీ 3 సీఐగా రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ప్రమోద్‌రావు ప్రస్తుతం మందమర్రి సీఐగా పనిచేస్తున్నారు.

'ఆసరా' ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

- ఏడడుగులు నడచి ఒక్కటైన ఏడు జంటలు


కాళ్లుకడిగి కన్యదానం చేస్తున్న పెంట రాజేశ్‌దంపతులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఏడు జంటలు పెళ్లికి ముందుకు రాగా వారికి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెంట రాజేశ్ దంపతులు కాళ్లు కడిగి కన్యదానం చేశారు. ప్రధాన అర్చకులు కొండపాక శ్రీనివాసాచార్యులు వివాహాలు జరిపించారు. అనంతరం విందుభోజనాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 112 జంటలకు వివాహాలు జరిపించామని పెంట రాజేశ్‌తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, కొమ్ము‌వేణు, తూముల శ్రీనివాస్, దిలీప్ కత్రీ, రాజుయాదవ్, మోహన్‌జీ, కొమురయ్య, సదానందం, దేవేందర్ తదితరులున్నారు.

కన్నాలవాసికి ఉత్తమ సేవా అవార్డు


పృథ్వీరాజ్

పాలకుర్తి: మండలంలోని కన్నాల శాలపల్లికి చెందిన భీమనపల్లి పృథ్వీరాజ్‌కు రాజస్థాన్ రాష్ట్రంలోని రాష్ట్రహిత్ ఫౌండేషన్ 'సేవ్ ది హ్యూమానిటీ అండ్ గ్లోబల్ హ్యూమానిటీ చేంజ్ మేకర్ -2023 అవార్డును ప్రకటించింది. వృత్తిరీత్యా హోంగార్డుగా పనిచేస్తున్న పృథ్వీరాజ్ గతకొన్నేళ్లుగా 'తెలంగాణ ఐ ఆర్గాన్ బాడీ డోనర్స్ అసోషియేషన్' పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. సమాజంలో శాంతి, మానవత్వం, ప్రేమ పెంపొందించే దిశగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు పృథ్వీరాజ్‌కు ఈ అవార్డును ప్రకటించినట్లు రాష్ట్రహిత్ ఫౌండేషన్ ప్రతినిధి అక్షయ్‌కుమార్ తెలిపారు. పృథ్వీరాజ్ అవార్డు పొందడంపై తెలంగాణ ఐఆర్గాన్ బాడీ డోనర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మేర్గు భీష్మాచారి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టుబడిన పగటి దొంగ

- రూ.1.20 కోట్ల సొత్తుచోరీ
- పోలీసులకు చిక్కిన వెంకటేశ్
- నాలుగేళ్లుగా దొంగతనాలు
- చోరీ సొత్తుతో ఆన్‌లైన్ గేమింగ్
- మణుగూరులో ఇల్లు కొనుగోలు


నిందితుడితో సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ, అధికారులు

గోదావరిఖని: నాలుగేళ్లుగా వరుస చోరీలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. 72 దొంగతనాల్లో రూ.1.20 కోట్ల సొత్తు చోరీకి పాల్పడ్డాడు. 2.89కిలోల బంగారం, 4.07 కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. చివరకు గురువారం పోలీసులకు చిక్కాడు.. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి చోరీ వివరాలు వెల్లడించారు. సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నెల్లూరు జిల్లా తక్కళ్లపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన రాజవరపు వెంకటేశ్(28) కొన్నేళ్ల క్రితం మంచిర్యాల జిల్లాకు వచ్చాడు. శ్రీరాంపూర్‌కు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని సీసీ నస్పూర్ షిర్కేకాలనీ క్వార్టర్ 1145లో నివసిస్తున్నాడు. 2019లో మొదటి సారి చోరీకి పాల్పడిన వెంకటేశ్ ఇప్పటివరకు 72 చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. చోరీలకు పాల్పడగా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వినియోగించినట్లు వివరించారు. అంతేకాకుండా దొంగిలించిన ఆభరణాలను ముత్తూట్, శ్రీరాంఫైనాన్స్‌లో కొంత తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో మణుగూరులో ఇల్లు కొనుగోలు చేసినట్లు వివరాలు వెల్లడించారు. పెద్దమొత్తంలో ధఫాబెట్ కోసం వెచ్చించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ ఫ్లైట్‌మోడ్.. పట్టపగలే చోరీలు

చోరీచేసే ప్రాంతాన్ని ఎంచుకుని ఉదయమే సెల్‌ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకుని బైక్ లేదా కారులో వెళ్తూ చోరీలకు పాల్పడుతుండేవాడు. రాత్రిళ్లు పోలీస్ పెట్రోలింగ్ ఉంటుందన్న భయంతో పగలే ఇళ్లకు కన్నం వేస్తుండేవాడు. ఇలా ఇంట్లో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారికి అనుమానం రాకుండా చోరీలకు పాల్పడినట్లు సీపీ వివరించారు. అయితే మధ్యలో కొన్ని రోజులు భవన నిర్మాణ పనులకు వెళ్లేవాడన్నారు. ఒంటరిగానే బైక్, బస్సుల్లో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడేవాడు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి వెనకాల తలుపులు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. సీసీకెమెరాలు, జనసంచారం లేని ఇల్లే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరిగాడు.

70కిపైగా చోరీలు

పోలీసులకు చిక్కిన నిందితుడు వెంకటేశ్ రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో 70కి పైగా కేసులు నమోదయ్యాయి. గోదావరిఖని వన్‌టౌన్‌లో 14, నస్పూర్‌లో 7, లక్సెట్టిపేట్‌లో 6, చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో 7, మందమర్రిలో 11, రామక్రిష్ణాపూర్‌లో అత్యధికంగా 17, కాసిపేటలో రెండు, మంచిర్యాల శ్రీరాంపూర్‌లో ఒకటి, మంచిర్యాలలో ఐదు, బీమారంలో రెండు దొంగతనాలతో మొత్తం 72 చోరీలు చేసి రూ.1.20లక్షల విలువ చేసే 2.89కిలోల బంగారం, 4.07కిలోల వెండి, రూ.19లక్షల నగదు ఎత్తుకెళ్లాడు.

చివరకు చిక్కిందిలా..

గడిచిన నాలుగేళ్లుగా చోరీలకు పాల్పడిన వెంకటేశ్ గురువారం అనుమానస్పద స్థితిలో పోలీసులకు చిక్కాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వేలిముద్రలు సేకరించి ఫింగర్‌ప్రింట్ విభాగానికి పంపించారు. దీంతో 50కిపైగా చోరీల్లో ఇవే వేలిముద్రలున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో తమదైన శైలిలో విచారించడంతో చోరీలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాడు.

పోలీసులకు దొరకని సొత్తు..

70కిపైగా ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడిని పట్టుకున్నప్పటికీ సొత్తు మాత్రం దొరకలేదని సీపీ వెల్లడించారు. చోరీ సొత్తు ఆన్‌లైన్ గేమ్ దఫాబేట్ ఆడిపొగొట్టుకున్నాడని, కొంత బంగారం శ్రీరాంఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో ఆన్‌లైన్ గేమింగ్, జల్సాలకు వినియోగించాడని సీపీ వివరించారు. తిరిగి పోలీస్ కస్టడీకి తీసుకుని సొత్తంతా రికవరీ చేసేందుకు యత్నిస్తున్నామన్నారు.

పోలీసులకు సీపీ అభినందన

పోలీసులను ముప్పతిప్పలు పెట్టి నాలుగేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న వెంకటేశ్‌ను పట్టుకున్న మంచిర్యాల పోలీసులను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు. డీసీపీ సుధీర్‌కేకన్‌రామనాథ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సై రవికుమార్, ఉదయ్‌కిరణ్, ఏఎస్సై జితేందర్‌సింగ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, తిరుపతి, రవిని అభినందించి నగదు రివార్డులు అందించారు.

పాఠశాలల్లో ట్రైనీ ఐఏఎస్‌లు


పాఠశాలలో క్రీడా సామగ్రి అందిస్తున్న ట్రైనీలు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన క్రీడాసామగ్రిని అందించారు. సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎంలు నలుమాసు సుదర్శనం, అప్పిడి సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్రవంతి, రామ్మోహన్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి వారిని ట్రైనీ ఐఏఎస్‌లు దర్శించుకున్నారు. స్వామివారి విశిష్టతను అర్చకులను అడిగి తెల్సుకున్నారు. అమిత్‌కుమార్, రవికుమార్‌వర్మ, విశ్వనాథ్‌కుమార్, నిమిత్ థాలియా, కౌస్తబ్ రాజ్‌పుత్, సర్పంచు బండ రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటల సాగు వివరాల సేకరణ

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో ట్రైనీ ఐఏఎస్‌లు అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. వర్షాల పడే సమయం.. పంటల సాగు, కోతలపై ఏవో ప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్ యాదవ్, ఎంపీవో కిరణ్ ఉన్నారు.

మంథనిలో సన్మానం

మంథని: మంథని విద్యార్థి యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సిబ్బంది ట్రైనీ ఐఏఎస్‌లను సన్మానించారు. ఆర్డీవో వీరబ్రహ్మాచారి, డీఏఓ తూము రవీందర్, ఎంపీడీఓ రమేశ్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొండేల మారుతి ఉన్నారు.

ఫ్యాన్లు, నోట్‌బుక్కుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని లక్ష్మీపురం పాఠశాలలో ట్రైనీ ఐఏఎస్‌లు ఫ్యాన్లు, క్రీడాసామగ్రి, నోట్‌బుక్కులు అందించారు. సర్పంచు బండ రవీందర్ రెడ్డి, ఎంపీటీసీ రావి సదానందం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్రావణ్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి.. రామగిరి మండలం సుందిళ్ల రైతువేదిక వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుందిళ్లకు చెందిన ఆర్ల శ్రావణ్(28) మృతి చెందాడు, స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సుందిళ్ల గడ్డంపల్లికి చెందిన శ్రావణ్ సింగరేణి ఓసీపీ-5 లో ప్రైవేట్ కాంట్రాక్టర్ కార్మికుడు. హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన గోదావరిఖని నుంచి గడ్డంపల్లికి వెళ్తున్న క్రమంలో మంథని నుంచి గోదావరిఖని వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రావణ్ తలకు బలమైన గాయం కాగా 108లో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని టూటౌన్ రెండో సీఐ అఫ్జలోద్దీన్ తెలిపారు.

'రైతులకు రుణమాఫీ ప్రకటించాలి'

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ కోరారు. సుల్తానాబాద్ పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు పంట రుణాలు అందని ద్రాక్షలా మారాయని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రుణమాఫీ చేసి కొత్తగా పంట రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024లో రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కాంగ్రెస్ ఏర్పడిన వెంటనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, పేదలకు నిత్యవసర వస్తువుల ధరలు తగ్గింపు, రూ. 500లకే వంటగ్యాస్ ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వపరంగా రూ.ఐదు లక్షలు అందిస్తామన్నారు.

మంటల్లో కాలిపోయిన మూడు కార్లు

- సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- రూ.68లక్షల నష్టమన్న బాధితుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య
- షార్ట్ సర్క్యూట్ కారణమా..?


మంటల్లో కాలుతున్న కార్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్యకు చెందిన మూడు కార్లు గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. పట్టణంలోని సాగర్ రోడ్డులోని షెడ్డులో కార్లను మూడు రోజుల క్రితం పార్కింగ్ చేశారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని, కారును సర్వీసింగ్ చేయించాలని రాజయ్య చెప్పడంతో డ్రైవర్ యూసుఫ్‌కారును స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చిందని, రెప్పపాటులోనే మంటలు చెలరేగాయని డ్రైవర్ వివరించాడు. ఆ పక్కనే రాజయ్యకు చెందిన మరో రెండుకార్లు కూడా పార్కింగ్ చేసి ఉండగా వాటికీ మంటలు వ్యాపించి అవికూడా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో కాలిన మూడు కార్ల విలువ రూ.68లక్షల వరకు ఉంటుందని రాజయ్య ఫిర్యాదుతో విచారణ చేస్తున్నామని అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ తెలిపారు. కియాకారు (రూ.26 లక్షలు) ఇన్నోవా కారు (రూ.24లక్షలు), క్రైటా కారు (రూ.18లక్షలు) నష్టం వాటిల్లిందని పేర్కొన్నట్లు వివరించారు. ఘటనా స్థలాన్ని సీఐలు ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ సందర్శించారు.



ట్రినిటిలో ఫ్లాష్‌మబ్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులు గురువారం ఫ్లాష్‌మబ్ నిర్వహించారు. స్టాప్ వైలెన్స్.. ఎగినెస్ట్ ఉమెన్స్ అనే అంశంపై ఫైనలియర్ విద్యార్థినులు నిర్వహించిన ఫ్లాష్‌మబ్ అలరించింది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అణచివేతకు గురవుతున్న తరుణంలో ఆడవారిని చదవనిద్దాం..ఆడవారిని ఎదగనిద్దాం దేశాభివృద్ధికి పాటుపడదాం అనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్ మణిగణేశన్, సురేశ్, రాజిరెడ్డి, నటరాజన్, స్వాతి, ప్రభాకర్, పద్మిని తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఓబీ కాంట్రాక్టు కార్మికుల భారీ ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న ఓబీ కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ఓబీ కాంట్రాక్టు కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. జీడీకే-5 ఓసీపీ నుంచి బైక్‌ర్యాలీగా వెళ్లి హైవేరోడ్డు దిగ్బంధించేందుకు నిర్ణయించారు. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకున్న పోలీసులు బైక్ ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో రూటు మళ్లించి ఆర్జీ-1 జీఎం ఆఫీస్‌వైపు తరలివెళ్లారు. అనంతరం ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. కార్మికుల సమస్యలపై చర్చలు జరపాలని, సాధ్యమైనంత త్వరగా డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సమస్య జఠిలం కాకుండా చూడాలని జీఎం కె.నారాయణను కోరారు. కార్యక్రమంలో నాయకులు కౌశికహరి, బుర్ర తిరుపతి, కుమారస్వామి, తోకల రమేశ్, వెంకన్న, విశ్వనాథ్, భూసాల తిరుపతి, మహవాది రామన్న, నిమ్మరాజుల రవి, గోపగాని నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదోసమావేశం నిర్వహించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య


మాట్లాడుతున్న సత్తయ్య

రామగిరి(మంథని): బొగ్గు గని కార్మికుల జేబీసీసీఐ 11వ వేతన ఒప్పందం ఎంజీబీ (మినీమం గ్యారెంటెడ్ బెనిఫిట్) 19శాతం సాధించడం చారిత్రాత్మక ఒప్పందమని, 9వ సమావేశం వెంటనే ఏర్పాటుచేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం రామగుండం ఏరియా-3 ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పూర్తిస్థాయిలో వేతన ఒప్పందం అమలుచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు రూ.25వేల కోట్లు సింగరేణి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలో నిర్వహించే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, నాయకులు వై.సారంగపాణి, మామిడి స్వామి, అనుప రమేశ్, జానీ, ముల్కూరి శ్రీనివాస్, వల్లెపు సురేశ్, మహేశ్, అజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయజోక్యం మితిమీరిపోయిందని, సంస్థ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ విమర్శించారు. గురువారం జీడీకే-1 వగనిపై గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ దినదిన గండంగా బతుకులు కొనసాగిస్తున్నారన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ నాయకులు మాత్రం తమ స్వార్థప్రయోజనాల కోసం పైరవీలు చేస్తూ ఆస్తులు పెంచుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే, ఎంపీల సిఫార్సు లేఖలతోనే సింగరేణిలో పాలన కొనసాగుతోందని కొంతమంది అధికారులు ప్రభుత్వానికి పూర్తిగా తొత్తులుగా మారి సింగరేణిని నాశనం చేస్తున్నారన్నారు. ఇక వారి ఆటలు సాగనీయబోమన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు సదానందం, నర్సింహారెడ్డి, ధర్మపురి, శ్రీనివాస్, సాగర్, అంజనేయులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో ఖాళీలు భర్తీ చేయాలి

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. గురువారం ఓసీపీ-3 కృషిభవన్‌లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఆపరేషన్స్, బేస్‌వర్క్‌షాప్, పంప్‌సెక్షన్, బ్లాస్టింగ్‌సెక్షన్, ఎస్అండ్‌డీ సెక్షన్లలో టెక్నీషియన్లు, జనరల్ మజ్దూర్‌లు లేక పనిభారం పెరుగుతోందన్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్మికులపై పనిభారం తగ్గించేందుకు వెంటనే ఖాళీ పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు టాయిలెట్లు, విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ షెల్టర్లు నిర్మించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజు కార్మికుల డిస్ట్రిబ్యూషన్ ఏరియాలో వాటర్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, బానాకర్, నర్సయ్య, తిరుపతి, శ్రీనివాస్, వెంకన్న, మల్లయ్య, నరేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని: సింగరేణి ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ బలరాం సూచించారు. గురువారం వీడియోకాన్ఫరెన్స్‌లో అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. సింగరేణి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కంపెనీ క్వార్టర్లు, ఖాళీ స్థలాలను అనుమతి లేకుండా దురాక్రమణకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-2 అధికారులు రాజేంద్రప్రసాద్, ధనుంజయ, పీవీరమణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి మాజీ ఉద్యోగికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి సంస్థ మాజీ ఉద్యోగికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... గోదావరిఖని ఐబీ కాలనీకి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి పోలు శ్రీహరి(62) రామగుండం వైపు బైక్‌పై వెళ్తుండగా భారీస్థాయి పొడవుగల లారీ ప్రాజెక్టు గేట్ లోపలకు క్రాస్ అవుతుండగా ప్రమాదం జరిగింది. గాయాలైన శ్రీహరిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కంపెనీ స్థలాలు, క్వార్టర్లు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

రామగిరి(మంథని): సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోని క్వార్టర్లు, ఖాళీస్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని డైరెక్టర్(పా)ఎన్.బలరామ్ ఆదేశించారు. గురువారం జీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. క్వార్టర్లను ఆక్రమించుకుని నివసిస్తున్న వారిపై, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంస్థకు చెందిన ఖాళీస్థలాలకు ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని ఆదేశించారు. ఈ సమస్యలపై ప్రతీ 10 నుంచి నెలరోజులకోసారి సెక్యూరిటీ, ఎస్టేట్స్, సివిల్, పర్సనల్ అధికారులతో సమీక్ష నిర్వహించాలని జీఎంలకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్జీ3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, సివిల్ ఎస్ఈ పద్మరాజు, డీవైపీఎం కావూరి మారుతి, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమా.. కుటుంబాలకు ధీమా

- తక్కువ ప్రీమియం.. అత్యధిక బోనస్


వై.వెంకటేశ్వర్లు

సుల్తానాబాద్: తపాలా బీమాతో కుటుంబాలకు ధీమాగా ఉంటుందని డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ వచ్చే వెసులుబాటు ఉంటుందని, దీనిని తపాలా శాఖ 140 ఏళ్ల క్రితమే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ రూపకల్పన చేసిందని తెలిపారు. తొలుత ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పరిమితం చేసిన తపాలా శాఖ.. ఇప్పుడు సామాన్యప్రజలకు విస్తరించిందన్నారు. రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం ఉందని, మధ్యలో లోన్ తీసుకునే వెసులుబాటు కూడా కల్పించిందని అన్నారు. పెద్దపల్లి డివిజన్ వ్యాప్తంగా తపాలా బీమా మేళాల నిర్వహణకు గురువారం నుంచి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ నెలాఖరు వరకు మేళాలు కొనసాగుతాయని వివరించారు. మరిన్ని వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీసులలో సంప్రదించాలని సూచించారు.